కథ

# తలవంచుకు నిలబడి

రామా చంద్రమౌళి

## ఆమె

రాత్రంతా ఎడతెగకుండా సన్నగా వర్షం కురుస్తూనే ఉంది.
వర్షం.. వర్షం.. రోడ్లపై, భవనాలపై, చెట్లపై, మురుక్కాలువలపై, హుస్సేన్‌సాగర్‌పై..
మంటపైనున్న పెనంవంటి తన మస్తిష్కంపై, మనస్సుపై, బుద్ధిపై.. హృదయంపై...
వర్షం.. వర్షం,
రాత్రంతా నిదురలేదు. కళ్ళనిండా మంట. కన్నీళ్ళు ఉబికుబికి వస్తున్న దుఃఖం. విద్యుత్తీగకు చిక్కి వేలాడ్తూ గాలికి రెపరెలాడ్తున్న పాతగుడ్డపేలికలా భాషకందని దుఃఖోద్వేగం.



తను మితిమీరి గాలి ఊదిన బుడగలా భళ్ళున పగిలిపోతుందా. ఫిలమెంట్ రాలిన బల్బులా ఆరిపోతుందా..

లేదా చేష్టలుడిగి ఒక రాతి బొమ్మగా మిగిలిపోతుందా

''హౌ ఓల్డ్ ఆర్ యు''.. మొన్న కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార సందర్భంగా జరిపిన ఇంటర్వ్యూలో 'హిందూ' విలేఖరి ప్రశ్న.

''ఫిఫ్టీ సిక్స్ ఇయర్స్ ఓల్డ్..''

తన ఏభై ఆరు సంవత్సరాలు పాతబడిపోయింది.. పాతబడిపోయింది తను.

ఎందుకో ప్రముఖ స్త్రీవాద రచయిత్రి నీలకు దుఃఖం ముంచుకొచ్చింది.

చుట్టూ అంతా చీకటి.. పడకగదినిండా చిక్కని నిశ్శబ్దం.. బయట సన్నగా చినుకుల చప్పుడు.

బెడ్‌లాంపేసి.. టైం చూచి.. ఐదూ ఐదు.

అంతుబట్టని అసహనం గర్జిస్తున్న సముద్రంలా ఉంది డుండెలనిండా.

లేచి, చెప్పులేసుకుని, గొడుగుపట్టుకుని రోడ్డుపైకొచ్చింది.

నడక.. నడక

ఎక్కడ ఆరంభమైందీ నడక. ఎక్కడిదాక సాగుతుందీ నడక.. ఎక్కడ ఆగుతుందీ నడక.. ఎప్పుడు ఆగు..,

'తప్పు చేసిందా తను?''

ఇరవై ఐదు సంవత్సరాలుగా వేధిస్తున్న ప్రశ్న.

ఒకవేళ తప్పే ఐతే ఆ తప్పునెందుకు చేసినట్టు.. తప్పేకాకుంటే క్షణం క్షణం అగ్నిపర్వతంవంటి ఈ అంతః క్షోభను నిశ్శబ్దంగా భరిస్తూ, దుఃఖిస్తూ.. సమాజంలో నటిస్తూ, పిల్లలముందు దోషిగా తల వంచుకుని నిలబడ్తూ.. పైకి సత్కారాలూ, పురస్కారాలు పొందుతూ.. ఏమి జీవితమిది.

జీవితమంటే నటనా..నటనే జీవితమా.

ఒక చేతిలో విప్పిన గొడుగుతో పరధ్యానంగా చినుకుల్లో నడుస్తున్న నీల చటుక్కున మరో చేత్తో ఎడమచెంపను అనాలోచితంగానే తడుముకుంది.

అనూహ్యంగా.. వేలమంది సమక్షంలో..



ఎంతో వైభవంగా జరుగుతున్న అభినందన సభలో..

తన చెంపను చెళ్ళుమనిపించి.. ముందరున్న మైక్‌ను ఉష పిడుగులు కురిపిస్తున్నట్టు చేసిన ప్రసంగం. బట్టబయలు చేసిన తన నిజస్వరూపం.. పొరలను, తెరలను చించి తూటాలవలె సంధించిన ప్రశ్నల పరంపర..

వేలాదిమంది అప్రతిభులై.. అవాక్కయి..

నిశ్శబ్ద.. నిశ్శబ్దం.. అందరి కళ్ళలో ఏవగింపు, రోత, అసహ్యం, జుగుప్స–

ఒక్కొక్కరే సభాస్థలినుండి బయటకువెళ్ళి,

చివరికి తను..కిషన్ – యిద్దరే..

మనిషికి మరణంకన్నా మించిన శిక్ష ఉంటుందా?మరణాన్ని అనుభవించడంకంటే మించిన క్షోభ ఉంటుందా?

తప్పకుండా ఉంటుందని తనకు అనుభవమౌతోందిప్పుడు.

అసలు నిజానికి తను నిన్ననే రాత్రి దాదాపు తొమ్మిదిగంటల యిరవై నిమిషాలకు మరణించింది.

నీలకు దుఃఖం ఎగదన్నుకొస్తోంది.

నడుస్తోంది.. లిబర్టీ.. టిటిడీ బిల్డింగ్, నారాయణగూడ, మీనాక్షి కాఫీషాప్..

ఏభై ఆరు సంవత్సరాల పురాతనజీవియైన తను.. పద్దెనిమిదేండ్లకు పెళ్ళి చేసుకుని.. ఒక గుమాస్తాను.. తల్లిదండ్రులు కుదిర్చినవాణ్ణి.. రెండువందల ఏభైరెండు రూపాయలు అతని జీతం.. ఏభై రూపాయల అద్దె ఇల్లు.. సాధారణ జీవితం... నాలుగేళ్ళలో యిద్దరు పిల్లలు.. ఒక మగ ఒక ఆడ..

అతనికి ఆఫీస్.. ఫైళ్ళు.. సైకిల్‌పై ప్రయాణం. పిల్లలు, ఇల్లు.. ఒక చిన్న ప్రపంచం.

తనకు పుస్తకాలు.. అధ్యయనం.. లోకాన్ని తెలుసుకోవడం. భావుకత.. సమాజం... మార్పు.. విప్లవాల ధ్యాస.. ఉద్యమాల సహానుభూతి.. ఒక విశాల విశ్వం.

ఏదో చేయాలి.. ఏదో చేయాలి..

ఏమి చేయాలి... తెలియదు.. కాని ఏదో చేయాలని మాత్రం తెలుసు

ఈ ప్రపంచం వద్దు.. ఈ సమాజం వద్దు.. మరో కొత్త ప్రపంచం కావాలి.. కొత్త కొత్త ఆం.. కొత్త ఇంకేదో కావాలి.. ఏమిటా కొత్త.. ప్చ్.. తెలియదు.

కాని ఎడతెగని పరితపన. తెలియనిదానికోసం పరివేదన.. ఎదురుచూపు.

సరిగ్గా.. అప్పుడు పరిచయమయ్యాడు కిషన్ ఒక సభలో

కిషన్‌తో స్నేహం అప్పుడు ఒక నిషా.. ఉన్మత్తత. అతని సంభాషణ. అతని మౌనం, అతని సాంగత్యం.. అతని స్పర్శ.. ఓహ్

కాని కిషన్‌కు అప్పటికే భార్య.. ఒక కొడుకు, ఒక కూతురు.

ఎక్కడో ప్రభుత్వ ఆఫీసులో ఓ ఉద్యోగం.

ఘర్షణ.. ఘర్షణ.. గోడలను పగులగొట్టుకుని,

ఊచలను ధ్వంసంచేసుకుని, సంకెళ్ళను తెంచుకుని..

కాని.. గోడలు, సంకెళ్ళు తనచుట్టూ నిజంగా ఉన్నాయా అసలు.. ఒట్టిగా ఊహించుకుందా.

వెనక్కి తిరిగి చూచుకుంటే.. అసలప్పుడు ఏం జరిగిందో, ఎలా జరిగిందో తెలియదు.

ఒక ఫైన్ నైట్,

ఇద్దరు పిల్లలతో తను... ఇద్దరు పిల్లలతో కిషన్..

తను తన భర్తను వదలి.. అతను అతని భార్యను విడిచి..

'కలిసి ఉండుట... కలిసి జీవించుట.. కలిసి జీవితాలను పంచుకునుట.. కలిసి పయనించుట..కలిసి దుఃఖించుట..!'

నీ పిల్లలు.. నా పిల్లలు.. మన పిల్లలు.

ప్రతిరోజూ ఎదుగుతున్న పిల్లలు ఎదుగుతున్న ప్రశ్నలై,

తన భర్త ఊర్కున్నాడా.. నానా గొడవ.. అతని భార్య ఊర్కుందా.. నానా బీభత్సం..

ప్రశ్నించుకొనుట.. ప్రశ్నింపబడుట..

ఇంతకూ ఎందుకిదంతా..మోహమా, వ్యామోహమా, కామమా... నిగ్రహాతీతమైన కాంక్షా.. ఉన్మాదమా –

పాఠశాలలో.. తర్వాత్తర్వాత కాలేజిల్లో పిల్లలు చేరేప్పుడు,

'అమ్మా నా నాన్న పేరేం రాయాలి..'

'అమ్మా నా అమ్మ పేరేం రాయాలి..' ప్రశ్నలు..

పిల్లలు ఎదుగుతున్నకొద్దీ.. మనుషులు ప్రశ్నలుగా మారడం.. తెలుసుకుంటూండడంతో ప్రశ్నలుగా ఎదగడం.. ప్రశ్నలై వ్యాపించడం.. ప్రశ్నలై గుచ్చుకోవడం,

యిరవై ఐదేళ్ళ తర్వాత

ఇంజనీరింగ్ చేస్తూ తనకు పుట్టిన వంశీ తన తండ్రిని వెదుక్కుంటూ శాశ్వతంగా వెళ్ళిపోయాడు.

కూతురు ఉష మాత్రం ఉంది. గుండెలపై బాంబై తనతోనే ఉంది. ఉష తనతో మాట్లాడక ఎనిమిదేళ్ళయింది.

కిషన్ పిల్లలు ఎప్పుడూ తనను 'అమ్మా' అని పిలవలేదు. యిద్దరు పిల్లలూ చివరికి తమను అసహ్యించుకుని ఒకరు సింగపూర్, ఒకరు అమెరికా వెళ్ళిపోయారు. వెళ్ళిన తర్వాత కిషన్ కొడుకు సాగర్ వాళ్ళమ్మను రప్పించుకుని తనతో ఉంచుకుంటున్నాడు.

కిషన్ కూతురు చిత్ర ఒంటరిగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా యుఎస్సేలో ఉద్యోగం చేసుకుంటూ అప్పుడప్పుడు ఒక శతఘ్ని వంటి ఇ–మెయిల్ పంపుతుంది తనకు.

ఎంత చితికి పోయిందో తను..

'కిషన్.. ఏమిటీ జీవితం, ఎందుకిలా అయ్యింది' అంటుంది తను.

అతను జవాబు చెప్పడు.. జవాబు లేదు. లేదని తనకూ తెలుసు.

ఈ మౌన, అంతర్ రహస్య దుఃఖంలో నుండి.. తను కథలు, నవలలు, వ్యాసాలు రాస్తుంది. కిషన్ కళాఖండాలైన చిత్రాలు గీస్తాడు. కవిత్వం రాస్తాడు, డాక్యుమెంటరీలు తీస్తాడు – వెరసి తామిద్దరూ యిపుడు అగ్రశ్రేణి కళాకారులు.

నిన్న..,

తనకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించిన సందర్భంగా, అభిమానులు, సాహిత్య సంస్థలు భారీగా ఏర్పాటు చేసిన అభినందన సభలో.. అనేక మంది వ్యక్తులు, సంస్థలు శాలువాలు కప్పుతూ పూలదండలు వేస్తూ కోలాహలంగా ఉన్న ఉద్విగ్నస్థితిలో.. అనూహ్యంగా మీడియా అందరినీ ప్రత్యేకంగా వెంట పిలుచుకుని వేదికపైకి వచ్చిన తన కూతురు ఉష.. గత ఎనిమిదేళ్ళుగా తనతోనే తనింట్లోనే ఉంటూ తనతో మాట్లాడని ఉష.. ఒక ఎర్రని గులాబీ పూలదండను తన మెడలో వేసి, మరుక్షణం చెంపపై ఛెళ్ళున చరిచి..

నిప్పులురుముతూ.. మైకును లాక్కుని–

## ఆమె కూతురు

నా పేరు ఉష. ఎమ్బీయె చదివాను.

మీతో ఈ అపూర్వ సత్కారాన్ని పొందుతున్న ఈ ప్రముఖ రచయిత్రి నీల మా అమ్మ.

కళలు, సాహిత్యం, సృజన, సమాజ ఉద్ధరణ, నీతులు, నైతిక విలువలు.. వీటన్నింటిపై విచ్చలవిడి చెత్తను గుప్పిస్తున్న మేధావులను ప్రశ్నించేందుకు యిప్పుడు వేదికపైకొచ్చాను నేను.

ఈమె ఇరవై ఐదేండ్ల క్రితం మా నాన్నను విడిచి, నన్నూ తమ్ముణ్ణీ తీసుకుని కిషన్ అనే ఈ ప్రఖ్యాత చిత్రకారుడితో లేచి వచ్చింది అప్పటికే యిద్దరు పిల్లలున్న భార్యను కూడా విడిచి ఈ కిషన్ గారు మా అమ్మతో కలిసి జీవించడం ప్రారంభించారు. వీళ్ళు భార్యాభర్తలు కారు. స్నేహితులు మాత్రమే కారు.. వీళ్ళ దృష్టిలో వీరు ఆదర్శజీవులు.

ఐతే వీళ్ళిద్దరికీ చెందిన ఈ నలుగురు పిల్లలం. మేమెవరం. సమాజంలో మా ఉనికి ఏమిటి. సమాజం దృష్టిలో మా విలువలు ఏమిటి.

వీళ్ల దిక్కుమాలిన ఆదర్శాల మాయలో మా జన్మలకు కర్తలైన మా నాన్నగానీ, ఈ కిషన్‌గారి భార్యగానీ వాళ్ల జీవితాల్లో ఎంత నష్టపోయారో, ఎంత క్షోభననుభవించారో, వాళ్ళ దుఃఖానికి బాధ్యులెవరో.. ఎవరికైనా తెలుసా..?

వ్యక్తిగతమైన సూడో వ్యామోహాలకు పిల్లల జీవితాలను బలిచేయమని ఏ శాస్త్రం చెబుతోంది.

అసలీ కలిసి ఉండడమనే దుష్టసంస్కృతి వల్ల వాళ్ళ సంతానానికి జరిగే నష్టానికి ఎవరు జవాబుదారీగా ఉంటారు. పిల్లలు తలలు వంచుకుని సమాజంలో తిరుగవలసిన స్థితిని కలుగజేసే అధికారం ఈ తల్లిదండ్రులకెవరిచ్చారు.

తమకు తామే ఇటువంటి దుర్మార్గజీవిత విధానాన్ని ఎంచుకునే వ్యక్తులకు సమాజానికి ఏవేవో నీతిబోధలూ, ఆదర్శాలను వల్లించి చెప్పే అర్హత ఉందా.

కళాకారులు, సృజనకారులు పౌరసమాజానికి ఒక రోల్‌మోడల్ కావలసిన అవసరంలేదా. ఆచరణాత్మకతలేని ఒట్టి ఊకదంపుడు నీతుల వల్లింపు ఆత్మవంచన, ఒట్టి ట్రాష్ కాదా?

ఆమె గొంతులో దుఃఖం కట్టలు తెగి..


యిక మాట్లాడలేక ఆగింది.. మనిషి దుఃఖంతో ఊగిపోతోంది.

చుట్టూ అంతా గడ్డకట్టిన నిశ్శబ్దం.. వ్యక్తుల బలహీనతలను సిద్ధాంతాలుగా చిత్రీకరించే దుష్ట ప్రయత్నం పట్ల చీత్కారం.. స్తబ్దత.

రాత్రంతా ఉష ఏడుస్తూనే ఉంది. ఎనిమిదేళ్ళుగా తాను అమ్మ అనే నీలతోగానీ, నాన్న కాని నాన్న కిషన్‌తో గానీ మాట్లాడ్డం లేదు.. అసహ్యం.

ఎవరిమీదో తెలియదు.. తనపై తనకే అసహ్యం..,

ఎప్పుడు తెల్లారిందో, ఉష ఉబికివస్తున్న దుఃఖంతో కురుస్తున్న సన్నని వర్షంలోనే మార్నింగ్ వాక్‌కు బయలుదేరింది. చినుకులు కురుస్తూనే



ఉన్నాయి.. బయటా, లోపలా..

అతను

అతను నడుస్తున్నాడు ట్యాంక్ బండ్‌పై.. చినుకుల్లో.. గొడుగుతో

కిషన్ అని పిలువబడే ప్రముఖ చిత్రకారుడనైన నేను..,

తలవంచుకుని నిలబడి... పశ్చాత్తాపంతో సిగ్గుపడ్తున్నాను.

నీలను తీసుకుని అప్పుడు.. ఇరవైఐదేండ్ల క్రితం రావడం బాగానే అనిపించింది.

యిద్దరి భావోద్వేగాలు, భావుకత, ఒకే అభిరుచులు, ఒకే ఉద్రిక్తస్థాయి.. అన్నీ సరే, కాని తనతో కాపురం చేసి యిద్దరు పిల్లలను కన్న అతి సాధారణ ఇల్లాలు రాధ సంగతి.

... ఆమె తప్పేమిటి.. ఎందుకు తను ఆమెను దూరం చేయవలసి వచ్చింది. అనుకూలవతే. విధేయురాలే, మంచి హృదయమే..

ఒకసారి అడిగింది కూడా అమాయకంగా 'ఎందుకిలా' అని.

జవాబు చెప్పగలిగాడా తను. లేదు. ఎందుకంటే తనదగ్గర జవాబు లేదు.

రాధకు తను అన్యాయం చేశాడనే అపరాధభావం నిరంతరం వెంటాడ్తూనే ఉంది. ఏళ్ళకు ఏళ్లుగా పిల్లల ముఖాల్లోకి సూటిగా చూడగలిగాడా తను.. ఊహూఁ.. లేదు. గిల్టీ..

పేరు, ప్రతిష్టలు, వేదికలపై చేసే ఆత్మవంచన ప్రసంగాలు.. అంతా డొల్ల.

ఆత్మనిండా తప్పుచేయడం వల్ల సంక్రమించిన మౌనదుఃఖం క్షోభ.

మొన్న చిన్న అమెరికా నుండి పంపిన ఈమెయిల్‌లో అడిగింది కదా

నాన్నా.. నిన్ననే అమ్మకు హార్ట ట్ాక్ వచ్చిందని అన్నయ్య చెప్పాడు.. ఆమె పిడికెడు గుండె నిండా ఒక జీవితకాల క్షోభ.. అమ్మ చేసిన తప్పేమిటి. ఆమెకు ఎందుకీ ఒక ఆజన్మాంత శిక్ష విధించావు. ఆమెకు కలిగిన నష్టాన్ని ఎవరైనా ఏరకంగానైనా పూరించగల్గుతారా.. నేనూ, అన్నయ్యా ఈ 'నీల' అనే వ్యక్తిని ఏమని పిలవాలి. అసలు ఎందుకీ విచ్చలవిడి మానవ సంబంధాలు... ఎందుకీ సంక్లిష్టతలు, ఇటువంటి అసాంఘిక కలసి ఉండడాలు అవసరమా. వీటివల్ల మీరు సాధించిందేమిటి.. కాగా మేము మీకు పుట్టినందుకు చాలా కోల్పోయాము కదా..!

జవాబుందా తన దగ్గర.

ప్చ్..

నడుస్తున్నాడు రోడ్డుపై.. తలంతా నిన్నటిరాత్రి సభలో నీలను ఉష కొట్టిన చెంపదెబ్బతాలుకు జ్ఞాపకంతో దిమ్మెక్కి ఉంది..

అతనప్పుడొక నడుస్తున్న శవం.

అతని కొడుకు

రాత్రి విమానంలో అప్పుడే ఇండియానుండి వచ్చిన సాగర్ ఆ ప్రాతఃకాలం కంప్యూటర్‌ను ఓపెన్‌చేసి ప్రఖ్యాత చిత్రకారుడైన తన తండ్రి కిషన్‌కు మెయిల్ టైప్ చేయడం ప్రారంభించాడు.

''నాన్నా.. ఈ రోజు మధ్యాహ్నాం నేను చెన్నైలో ఉన్నాను. పాండీ బజార్ రోహిణీ ఇంటర్నేషనల్ హోటల్ మూలపై ఎవరో ఒక తెలుగువ్యక్తి బాగా తాగి అపస్మారకంగా పడిపోయి చనిపోయాడని అందరూ అంటూంటే ఒక సాటి మనిషిగా దగ్గరికి పోయి చూశా. అతను మీ ప్రియురాలు నీల మాజీ మొగుడు శేఖర్. అకారణంగా భార్యనూ, యిద్దరు పిల్లలనూ కోల్పోయిన శేఖర్ జీవితాంతం మానసికంగా కృశించి ఈరకంగా దిక్కులేని కుక్కచావు చచ్చాడు.

ఈ అమానుషమైన అతని మరణానికి మాత్రం కారకులు ముమ్మాటికీ నీల, నువ్వే.

అది గొప్ప సాహిత్యకారిని కావచ్చు. నువ్వు మహా చిత్రకారునివి కావచ్చు. కాని నా దృష్టిలో మాత్రం మీరిద్దరూ పశువులు.

పశువులకు వావివరుసలుండవు. ఏ కట్టుబాట్లూ ఉండవు. స్వేచ్ఛ అంటే విశృంఖలత్వం కాదు.

నువ్వు శేఖర్‌ను హత్య చేశావు. నీల మా అమ్మ రాధను యింకా సుదీర్ఘ హత్య చేస్తూనే ఉంది.

మీరిద్దరు హంతకులు – సాగర్''

***

ఐపాడ్‌లో వచ్చిన వంశీ ఈ మెయిల్‌ను చూస్తూ కిషన్ గేట్ తెరుచుకుని లోపలికొచ్చాడు. అతని హృదయం బాటుకింద చితికిన టమాటా పండులా ఉంది.

అదే క్షణం.. చినుకుల్లో తడుస్తూ ఉష వచ్చింది పోర్టికోలోకి...

అప్పటికే గొడుగును మూసేస్తూ.. పోర్టికోకింద ప్రముఖ రచయిత్రి నీల..

రాత్రి చెంపదెబ్బతిన్న నీల..

లిప్తకాలంలో.. ఒకరికి తెలియకుండా ఇంకొకరు తలలు ఎత్తి.. చూపులు కలిసి.. మరుక్షణం చూపులు ఘర్షించి, విడిపోయి.. మౌనం.. అనివార్యమైన మౌనం.,

అందరూ తలలు వంచుకుని మౌనం..,

అందరూ తలలు వంచుకుని..

సిగ్గుతో..

చివరికి మిగుల్తున్నదేమిటి... ప్రశ్న–

★

**చిరునామా:**
**రామా చంద్రమౌళి**
**ఇంటి నెం. 11-24-498,**
**టెలిఫోన్ భవన్ లేన్,**
**పోచమ్మ మైదాన్,**
**వరంగల్ - 506 002.**
**సెల్: 93901 09993**



## రస్నాబేబీ ఎదురు చూపులు..

రస్నాబేబీకి ఇక ఎదురు చూపులే మిగిలేటట్టు ఉన్నాయి! చిన్నగా ఉన్నపుడు రస్నాబేబీగా అందరి చేత గుర్తింపు పొంది ఆ తరువాత హీరోయిన్ అయిన అంకితకు అనుకున్నంత పేరు రాలేదు. 'చీమ...చీమ...చీమ...'అంటూ జూనియర్ ఎన్టీఆర్‌తో సమానంగా డాన్స్ అదరగొట్టిన అంకితకు అవకాశాలు వెల్లువలా వస్తాయని అందరూ ఆశించారు. ఆమె కెరీర్‌లో 'సింహాద్రి' తప్పించి పెద్దగా హిట్లు లేకపోవడం ఒక విధంగా అంకితకు మైనస్ పాయింట్‌గానే నిలిచింది. అందం, నటన విషయంలో మిగతా హీరోయిన్లకు ఏమాత్రం తీసిపోకపోయినా....పసితనం వీడని ఆమె కళ్లు ఆమెకు స్టార్ ఇమేజ్‌ను తీసుకురాలేకపోయాయని అంటున్నారు. ఆమె చిత్రాల ఎంపిక కూడా ఇందుకు దోహదం చేసిందని సినీ విశ్లేషకులు పేర్కొన్నారు. ఏదిఏమైనా ఒక్క హిట్టయినా రాకపోతుందా? అన్న ఆశతో అంకిత ఎదురు చూస్తోంది. బెస్టాఫ్ లక్ అంకిత!